సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 24 । మే । 2024



కొత్తగూడెంలో జోరువాన..

జిల్లాలో పలుచోట్ల జోరువాన కురిసింది. ములకలపల్లిలో డైవర్షన్ రోడ్డు తెగి రాకపోకలు స్తంభించాయి. 8లో



సమస్యలపై దృష్టి..

జెన్‌కో సీఎండీ రిజ్వీ జిల్లాలో పర్యటిస్తుండగా, తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ కార్మికులు కోరుతున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 39° / 27°

జిల్లాలో శుక్రవారం కొంత సమయం మబ్బు పట్టనుండగా, మరికొంత సమయం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రగిరి రామయ్య నిత్యకల్యాణం గురువారం కమనీయంగా సాగింది. శ్రీ సీతారామ చంద్రస్వామివారికి తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం వైభవంగా చండీ హోమం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని యాగశాలలో హోమపూజలు చేశారు. ముందుగా మేళ తాళాల నడుమ వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజల అనంతరం చండీహోమం చేశారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చండీహోమం పూజలో పాల్గొన్న 30 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించిన సీఎండీ



సీఎండీ రిజ్వీకి స్వాగతం పలుకుతున్న సీఈలు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌ను జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ గురువారం సందర్శించారు. ఎన్‌పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. కేటీపీఎస్ ఓఅండ్‌ఎం గెస్ట్ హౌస్‌లో బస చేశారు. శుక్రవారం మణుగూరు బీటీపీఎస్ కర్మాగారాన్ని సందర్శించనున్నారు. తొలుత కేటీపీఎస్ 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు, 7వ దశ ఇన్‌చార్జి సీఈ జి.రాజ్‌కుమార్, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాస బాబు సీఎండీకి స్వాగతం పలికారు. సీఎండీ వెంట జెన్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, సీఈ రత్నాకర్ ఉన్నారు. కాగ ముందస్తుగా డైరెక్టర్లు కేటీపీఎస్ 7వ దశ కర్మాగారాన్ని సందర్శించి ఉత్పత్తి తీరును పరిశీలించారు.

ఉత్పత్తి లక్ష్యం సాధించాలి



బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: సమష్టి కృషితో యంత్రాల పని గంటలను సద్వినియోగం చేసుకుంటూ నిర్దేశిత వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మణుగూరు ఏరియాలో పర్యటించిన వారు మణుగూరు ఓసీ, ఓసీ-4 ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో క్వారీలో నీటిని బయటకు పంపే విధంగా సరిపడా మోటార్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అధికారులు నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, శ్యాంసుందర్, వీరభద్రుడు, సురేశ్, రాజేశ్వరరావు, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు రాత మారేనా..

కరోనాకు ముందు మణుగూరు నుంచి నిత్యం నాలుగు రైళ్లు రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం కేవలం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తప్ప మరో రైలు ఈ స్టేషన్ ముఖం చూడటం లేదు. రోజురోజుకు ప్రాభవం కోల్పోతున్న మణుగూరుకు రైల్వేశాఖ తాజా ప్రకటన ఊపును ఇచ్చింది. మణుగూరులో ప్రారంభమయ్యే ఈ మార్గం రామానుజపురం – కాటాపూర్ – తాడ్వాయి –మేడారం –భూపాలపల్లి – మంథనిల మీదుగా కాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ఉన్న రాఘవాపురం స్టేషన్ దగ్గర కలుస్తుంది. మొత్తంగా 207.80 కి.మీ నిడివి ఉన్న ఈ రైలుమార్గం నిర్మాణం కోసం రూ. 2,910 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనాల్లో పేర్కొన్నారు.

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ..

మణుగూరు-రామగుండం రైల్వేలైన్‌పై మరో ప్రకటన

- నాలుగు జిల్లాల్లో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- ఆరు నెలలుగా రైల్వే శాఖ నుంచి తరచూ ప్రకటనలు
- క్షేత్రస్థాయి పనుల్లో మాత్రం కనిపించని పురోగతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వాసులను ఊరించేలా మరో ప్రకటన రైల్వేశాఖ నుంచి వచ్చింది. ఇరవై ఏళ్లుగా అనేక సార్లు సర్వేలు జరిగిన మణుగూరు – రామగుండం రైల్వేలైనుకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. ఈ మార్గంలో ట్రాక్ నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే కొంతకాలంగా రైల్వే శాఖ

భూసేకరణకు గ్రీన్ సిగ్నల్

భద్రాచలం (పాండురంగాపురం)– మల్కన్‌గిరి, కిరండోల్ – కొత్తగూడెం, మణుగూరు – రామగుండం రైల్వేలైన్ల నిర్మాణానికి రైల్వేశాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అందులో భాగంగా ఈ మార్గాల నిర్మాణానికి సంబంధించి ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)కు ఆదేశాలు గతేడాది సెప్టెంబరులో జారీ చేసింది. ఆ తర్వాత ఇటు రాష్ట్రంలో అటు దేశంలో ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో గడిచిన ఆరేడు నెలలుగా ఈ ప్రాజెక్టులపై పురోగతి లేదు. తాజాగా మణుగూరు – రామగుండం రైల్వేలైను నిర్మాణంపై రైల్వేశాఖ స్పందించింది. ఈ రైలు మార్గం వెళ్లే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలో భూసేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు భూసేకరణకు సంబంధించి ఆయా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత నిధుల మంజూరు, పనుల విభజన, టెండర్లు, ట్రాక్ నిర్మాణం వంటి పనులు ఉంటాయి.

ప్రకటన ఆర్భాటం..

రైల్వేశాఖ ప్రకటనలకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న ఫలాలకు మధ్య పొంతన ఉండటం లేదు. గడిచిన రెండేళ్లుగా భద్రాద్రి జిల్లాకు సంబంధించి భద్రాచలం – మల్కన్‌గిరి, మణుగూరు – కిరండోల్, కొత్తగూడెం– కొండపల్లి, భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైల్వే లైన్ల నిర్మాణం కోసం అనేక మార్లు సర్వేలు జరిగాయి. ఇటీవల కొన్ని ప్రాజెక్టులు ఫైనల్ లోకేషన్ సర్వే వరకు వెళ్లాయి. మరోవైపు డోర్నకల్ – భద్రాచలంరోడ్ డబ్లింగ్ పనుల్లో ఇసుమంతైనా పురోగతి లేదు. ప్రతీ ఆరు నెలలకోసారి పైన పేర్కొన్న ప్రాజెక్టుల్లో ఏదో ఒక అంశంపై ప్రకటన రావడం.. ఆ తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడం పరిపాటిగా మారింది. ఇక మావోయిస్టుల దాడి కారణంగా రెండు దశాబ్దాల కిందట ఇల్లెందు (సింగరేణి కాలరీస్) – కారేపల్లి రైలును రద్దు చేశారు. ఆ తర్వాత ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఈ రైలును పునరుద్ధరించలేదు. ఆఖరికి ఇల్లెందు రైల్వే స్టేషన్‌ను సైతం ఎత్తేశారు.

ప్రయోజనమేది..

సింగరేణి సంస్థ ఆర్థిక సహకారంతో నిర్మించిన భద్రాచలం రోడ్ – సత్తుపల్లి రైల్వేలైన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. ఏడాది కాలంగా ఈ మార్గంలో కేవలం బొగ్గు రవాణానే జరుగుతోంది. ప్యాసింజర్ రైలును ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశంపై ఉలుకూపలుకు లేదు. మరోవైపు గడిచిన పన్నెండేళ్లుగా కొనసాగుతున్న విజయవాడ – డోర్నకల్ – కాజీపేట – బల్లార్షా మార్గంలో ట్రిప్లింగ్ పనుల కారణంగా కొత్తగూడెం, ఖమ్మంల మీదుగా వెళ్లే అనేక రైళ్లు గడిచిన రెండేళ్లుగా విరివిగా రద్దవుతున్నాయి. ఇక అరకొరగా నడుస్తున్న రైళ్లు సైతం గంటల తరబడి ఆలస్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖనిజ సంపదకు నిలయంగా ఉన్న భద్రాద్రి ఏజెన్సీ జిల్లాలో చేపట్టే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అదే విధంగా లాభనష్టాలతో సంబంధం లేకుండా సామాజిక బాధ్యతగా మెరుగైన రైలు ప్రయాణ సౌకర్యం ఇక్కడి ప్రజలకు కల్పించాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్

- రైతు నుంచి రూ.20 వేలు తీసుకుంటూ చిక్కిన డీటీ
- సదరు అధికారి ఏసీబీకి పట్టుబడటం ఇదే రెండోసారి



లంచం తీసుకుంటూ పట్టుబడిన డీటీ భరణిబాబుతో ఏసీబీ అధికారులు

చర్ల: ఓ రైతు తాను కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునే క్రమంలో లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ గురువారం రూ.20 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ ఉమ్మడి ఖమ్మం జిల్లా డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... చర్ల మండలంలోని దండుపేటకు చెందిన కర్ల రాంబాబు గ్రామంలో 3.05 ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు 2022 జూలై 10న రెవెన్యూ కార్యాలయంలో అప్పటి ఇన్‌చార్జ్ తహసీల్దార్, ప్రస్తుత డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబును సంప్రదించాడు. ఆపై రకరకాల సమస్యలతో రిజిస్ట్రేషన్ చేయించుకోకపోగా, ఇటీవల మళ్లీ భరణిబాబును సంప్రదిస్తే రూ.50 వేలు ఇవ్వాలని సూచించాడు. అయితే, అంత ఇవ్వలేనని రైతు రాంబాబు చెప్పడంతో రూ.20వేలకు అంగీకరించాడు. ఈమేరకు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన రైతు వారి సూచనలతో గురువారం మధ్యాహ్నం రూ.20 వేలను తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. అనంతరం ఆయనపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐలు శేఖర్, మహేష్‌బాబు, సునీల్ పాల్గొన్నారు.

బూర్గంపాడులో పనిచేసిన సమయంలోనూ..

బూర్గంపాడు: భరణిబాబు గతంలో బూర్గంపాడులో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టిన అప్పటి ప్రభుత్వం ఇసుక కోసం కాంట్రాక్టర్లకు రెవెన్యూశాఖ ద్వారా కూపన్లు జారీ చేసింది. అయితే కాంట్రాక్టర్‌కు కూపన్లు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు పట్టుబడి, సస్పెన్షన్‌కు గురయ్యాడు. జిల్లాలో రెవెన్యూశాఖలో ఒకే అధికారి రెండుసార్లు ఏసీబీ వలలో చిక్కడం గమనార్హం.

రైతులకు అవగాహన కల్పిస్తాం

జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నాణ్యమైన విత్తనాలతో సాగు చేసేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ డాక్టర్ గోపి గురువారం అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలంలో సాగు, విత్తనాలు, రైతులు తీసుకోవాల్సి జాగ్రత్తలపై వివరించారు. జిల్లా నుంచి హాజరైన బాబూరావు మాట్లాడుతూ జిల్లాలో సాగు చేసే విస్తీర్ణం ఆధారంగా విత్తన అవసరాలను అంచనా వేసినట్లు తెలిపారు. నాణ్యమైన విత్తన సేకరణకు రైతుల్లో అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ ఖరారు చేశామని తెలిపారు. మండల వ్యసాయాధికారి, వ్యవసాయ విస్తరణాధికారులు రోజూ విత్తన డీలర్‌షాపులను సందర్శించి అమ్మకాలను పరిశీలిస్తారని తెలిపారు.

రైతులకు సూచనలు

విత్తనాలు విడిగా, బ్యాగులో లేనివి కొనుగోలు చేయొద్దని అధికారులు రైతులకు సూచించారు. అనుమతిలేని బీజీ-3 విత్తనాలు సాగుచేయొద్దని, కొనుగోలుకు ముందు కాలపరిమితి పరిశీలించాలని, తప్పనిసరిగా రశీదు/బిల్లు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్నిరకాల పత్తి విత్తనాలు దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటాయని, ప్రత్యేకంగా ఒకే రకమైన విత్తనాల కోసం రైతులు ప్రాధాన్యత ఇవ్వొద్దని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. 40–50 మి.మీ. వర్షపాతం నమోదైన తర్వాతనే పత్తి విత్తనాలు విత్తుకోవాలని, జిల్లాలో పత్తి 2,16,625 ఎకరాల్లో సాగు అంచనా వేయగా సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

భవనాల నిర్మాణం పూర్తయ్యేనా..?

- పునాది దశలోనే మెడికల్ కళాశాల బిల్డింగ్‌లు
- నిధుల కొరతతో ఏడాదికాలంగా నిలిచిన పనులు
- నర్సింగ్ కళాశాల భవనంలోనే వైద్యవిద్యార్థులకు తరగతులు



పునాది దశలోనే నిలిచిన వైద్య కళాశాల భవనం

కొత్తగూడెంరూరల్: మెడికల్ కళాశాల భవనాలు, హాస్టల్ భవనాల నిర్మాణం పునాది దశలోనే నిలిచిపోయింది. నిధుల కొరతతో ఏడాదికాలంగా పనులు ముందుకు సాగడంలేదు. 2022లో జిల్లాకు వైద్య కళాశాల మంజూరుకాగా, 2023లో కేఎస్ఎం ప్రాంతంలో కళాశాల భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు రూ. 30 కోట్ల పనులు జరిగినా బిల్లులు రాలేదని, అందుకే కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఎంబీబీఎస్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే ఆగస్టులో మరో 150 మంది విద్యార్థులు చేరతారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ ప్రాంగణంలోనే నర్సింగ్ కళాశాలకు నిర్మించిన భవనంలో మెడికోలకు విద్యాబోధన చేస్తున్నారు. పాల్వంచ, కొత్తగూడెం అద్దె భవనాల్లో వసతి కల్పించారు. దీంతో హాస్టళ్ల నుంచి కళాశాలకు రావడానికి మెడికోలు ఇబ్బందులు పడుతున్నారు. సరైన ల్యాబ్ సౌకర్యాలు లేవని ఇటీవల వైద్యవిద్యార్థులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక మెడికల్ కళాశాల భవనాల నిర్మాణంపై నివేదిక తీసుకుంది. కానీ ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు.

ప్రైవేట్ భవనంలో నర్సింగ్ కళాశాల..

మెడికల్ కళాశాల ప్రాంగణంలో నర్సింగ్ కాలేజీ భవనం నిర్మించారు. కానీ ఆ భవనంలో వైద్య విద్యార్థులకు విద్యాబోధన సాగిస్తున్నారు. దీంతో కొత్తగూడెంలో ఓ ప్రైవేట్ భవనం అద్దెకు తీసుకుని నర్సింగ్ కళాశాల నిర్వహిస్తున్నారు. సుమారు 120 మంది విద్యార్థులు ఇక్కడ నర్సింగ్ విద్యనభ్యసిస్తున్నారు. తరగతుల నిర్వహణతోపాటు హాస్టల్ వసతి కూడా అక్కడే కల్పించారు. రానున్న విద్యా సంవత్సరంలో నర్సింగ్ విద్యార్థుల సంఖ్య కూడా పెరగనుంది. ఇప్పటికే ప్రైవేటు భవనంలో అవస్థల నడుమ విద్యాబోధన సాగుతోంది. ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగితే ఇబ్బందులు తప్పవు.

ఎంసీహెచ్ ఒకచోట.. సర్వజన ఆస్పత్రి మరోచోట

జిల్లా కేంద్రంలో 150 పడకలతో మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్), 280 పడకలతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. సర్వజన ఆస్పత్రి నుంచి ఎంసీహెచ్‌కు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. గర్భిణులకు శస్త్రచికిత్సలు చేయించాల్సి వస్తే రక్తం కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా సర్వజన ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. రక్తం ఎక్కించడంలో జాప్యం జరుగుతుండగా, ఇటీవల జూలూరుపాడు మండలానికి చెందిన ఓ గర్భిణి మృతి చెందింది. ఎంసీహెచ్, సర్వజన ఆస్పత్రి ఒకే దగ్గర ఉంటే ఇలాంటి సమస్యలు వచ్చేవికావు. ఎంసీహెచ్ వెనుకభాగంలో క్రిటికల్ కేర్ నిర్మిస్తున్నా అది ఇంకా పూర్తి కాలేదు. ఆస్పత్రులన్నీ ఒకేచోట ఉండాలని ఇటీవల జరిగిన జెడ్పీ సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లేవనెత్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్పందించి మెడికల్ కళాశాల భవనం నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

త్వరితగతిన సిద్ధం చేయాలి

- పాఠశాలల ప్రారంభం నాటికి యూనిఫాం అందించాలి
- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



యూనిఫాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులందరికీ యూనిఫాం అందించాలని, ఇందుకోసం త్వరితగతిన కుట్టు పనులు పూర్తి చేసి, సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తగూడెంలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఏకరూప దుస్తుల తయారీని పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 63,399 విద్యార్థులు ఉండగా, వీరికి యూనిఫాం కుట్టేందుకు 1,26,677 మీటర్ల క్లాత్ అవసరం అవుతుందని తెలిపారు. ఈ నెల 20న 1,16,167 మీటర్ల క్లాత్ జిల్లా కేంద్రానికి చేరుకుందని, ఇంకా 10,510 మీటర్ల క్లాత్ రావాల్సి ఉందన్నారు. దుస్తుల తయారీకి 93 మహిళా శక్తి కుట్టు బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. దీంతో స్వయం సహాయక సంఘాలకు కూడా ఉపాధి దొరుకుతుందని చెప్పారు.

అలసత్వం సహించేది లేదు

యూనిఫాం తయారీలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ప్రియాంక హెచ్చరించారు. జిల్లాలోని ఎంపీడీఓ, ఎంఈఓ, ఎంఎస్ఓ, ఏపీఎంలతో యూనిఫాం తయారీపై నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. దుస్తులు కుట్టే పనులు నత్తనడకన సాగడంపై అసహనం వ్యక్తం చేశారు.

డీఎంఎఫ్‌టీ పనులను సకాలంలో పూర్తిచేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీఎంఎఫ్‌టీ పనులు సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్‌టీ) ద్వారా చేపడుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు.

ధాన్యం మిల్లులకు తరలించాలి

సుజాతనగర్ : ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ధాన్యంలో తేమశాతం 17 వచ్చే వరకు ఆరబెట్టాలన్నారు. అనంతరం వేపలగడ్డ ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి, స్కూల్‌వద్ద విద్యుత్ తీగలు వేలాడకుండా శాశ్వత చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల అధికారి రుక్మిణి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, డీఈఓ వెంకటేశ్వరాచారి, సుజాతనగర్, కొత్తగూడెం తహసీల్దార్లు శిరీష, పుల్లయ్య, పంచాయితీరాజ్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను పరిశీలించాలి

కరకగూడెం: పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిశీలించాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు సూచించారు. గురువారం ఆయన కరకగూడెం తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిశీలనలో పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జాప్యం లేకుండా జారీ చేయాలన్నారు. తహసీల్దార్ నాగ ప్రసాద్, ఆర్ఐ షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ములకలపల్లి పరీక్ష కేంద్రంలో బల్లలపై హాల్ టికెట్ నంబర్లు రాస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి బి.సులోచనరాణి తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనుండగా, జిల్లాలో 23 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, వీరిలో మొదటి సంవత్సరంలో 5,408 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,726 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయనున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. పరీక్ష వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులు సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నోడల్ అధికారి, హాల్ టికెట్లపై ప్రిన్సిపాళ్ల సంతకం అవసరం లేదని ఇంటర్మీడియట్ అధికారులు తెలిపారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల పర్యవేక్షణలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించనున్నారు.

కాళేశ్వరం కథ కంచికే..

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

చుంచుపల్లి: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దొందూదొందేనని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు పేర్కొన్నారు. గురువారం కొత్తగూడెం వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో, కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కాళేశ్వరం కథ కంచికే పోయిందని, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో పురోగతి లేదని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా అవగాహనలేని పాలన సాగుతోందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా, పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలిపించినా కనీసం ఒక్క యూనివర్సిటీని కూడా తెచ్చుకోలేకపోయారని విమర్శించారు. సన్నవడ్లకు, దొడ్డువడ్లకు తేడా తెలియని మంత్రులు ప్రభుత్వంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. పంటల విస్తీర్ణం, దిగుబడి వంటి అంశాలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. షరతులు లేకుండా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయాలని చూస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో షిండేలు ఎవరో త్వరలోనే తేలుతుందని అన్నారు. బీఆర్ఎస్‌లో చివరకు తండ్రి, కొడుకు, అల్లుడు ముగ్గురే మిగులుతారని చెప్పారు. పార్లమెంట్ ఫలితాల్లో బీజేపీ డబుల్ డిజిట్‌తో రాష్ట్రంలో హవా కొనసాగిస్తుందన్నారు. మచ్చలేని నాయకుడిగా కొనసాగుతున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి పట్టభద్రులు ఓటేసి అండగా నిలవాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రబాబు, పి.వెంకటేశ్వర్లు, పైడిపాటి రవీందర్, భైరి నిర్మల, మడివి రవి, రాయుడు నాగేశ్వరరావు, ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారిని బీజేపీ నాయకుడు ఎం.రఘునందన్‌రావు గురువారం దర్శించుకుని పూజలు చేశారు.

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యాన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యాన ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుంది. ఈ మేరకు త్రెడ్డింగ్, వ్యాక్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్‌ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్, శారీ డ్రాపింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25 వరకు ఖమ్మం మామిళ్లగూడెంలోని లహరి బ్యూటీపార్లర్, ట్రెనింగ్ సెంటర్‌లో రూ.3 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి సమాచారం కోసం 96660 13544, 96182 18701 నంబర్లలో సంప్రదించాలి.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలతో మణుగూరు కరాటే విద్యార్థులు

మణుగూరురూరల్: గోవాలోని మడ్‌గావ్‌లోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19న జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో మణుగూరుకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సీనియర్ లేడీ కరాటే మాస్టర్ కాశీమల్ల పద్మ గురువారం తెలిపారు. ఐదు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ఐదు దేశాలు, 12 రాష్ట్రాల వారు పాల్గొనగా.. బ్లాక్ బెల్ట్ విభాగంలో యామిని బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకుంది. బ్రౌన్ బెల్ట్ విభాగంలో మిధులశ్రీ బంగారు, రజతం, ఆషిక కాంస్య పతకాలను సాధించారు. ఎల్లో బెల్ట్ విభాగంలో నిఖిలేశ్, జ్ఞానేశ్, రక్షిత్ బంగారు పతకాలు, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో వెండి పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ బాలుర విభాగంలో విగ్నేశ్, సీనియర్ బ్లాక్ బెల్ట్ బాలికల విభాగంలో పద్మ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని ఆమె వివరించారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు

భద్రాచలం: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని భద్రాచలం, సుదిమల్ల, మణుగూరు, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి, అంకంపాలెం, వైరా తదితర గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో ఖాళీగా ఉన్న 585 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరగగా 700 మందికి పైగా బాలికలు హాజరయ్యారని ఆర్‌సీఓ తెలిపారు. కౌన్సెలింగ్‌ను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పర్యవేక్షించారు.

చంద్రుగొండలో బైక్ చోరీ..

పాల్వంచలో పోలీసులకు చిక్కిన నిందితులు?

చంద్రుగొండ: మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి ఎస్కే బషీర్‌కు చెందిన ద్విచక్రవాహనం(పల్సర్) చోరీకి గురైంది. బషీర్ తన వాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేయగా, ఉదయం నిద్రలేచి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. కాగా, గురువారం తెల్లవారుజామున పాల్వంచలో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఇక్కడ చోరీకి గురైన ద్విచక్రవాహనం దొరికినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ చోరీకి గురైన వాహనంతో పాటు మరో రెండు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మధిర, సత్తుపల్లి, ఏపీలోని తిరువూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి వాహనాలను అపహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాది కిందట ప్రధాన సెంటర్లోని ఓ పత్రికా విలేకరి తన ఇంటి ముందు ఉంచిన పల్సర్ వాహనం చోరీకి గురి కాగా, గంజాయి రామకృష్ణకు చెందిన మరో పల్సర్ వాహనాన్ని నాలుగు నెలల కిందట గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బస్టాండ్ సెంటర్లో ఎస్కే షబ్బీర్ తన ఇంటి ఎదుట ఉంచిన హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్ కుడా రెండు నెలల కిందట చోరీకి గురైంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

సమస్యలపై దృష్టి సారించండి..

- ఆర్టిజన్‌లకు సౌకర్యాలు లేక ఇక్కట్లు
- సిబ్బంది క్వార్టర్ల నిర్మాణంపై స్పష్టత కరువు
- కేటీపీఎస్ ఎఫ్‌జీడీ నిర్మాణంలో జాప్యం
- నేడు బీటీపీఎస్‌లో పర్యటించనున్న జెన్‌కో సీఎండీ

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగ, కార్మిక సమస్యలపై జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే ఆర్టిజన్‌లుగా నియామకమై ఏడేళ్లు గడుస్తున్నా నేటికీ వారి సమస్యలు కొలిక్కి రాలేదు. అంతేగాక కేటీపీఎస్‌లో నిర్మాణంలో ఉన్న ఎఫ్‌జీడీ ప్లాంట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉద్యోగుల క్వార్టర్ల నిర్మాణాలపై ఇంకా సరైన స్పష్టత కరువైంది. సీఎండీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి శుక్రవారం జిల్లాలోని బీటీపీఎస్‌లో పర్యటించనున్న నేపథ్యంలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.



కేటీపీఎస్ కాంప్లెక్స్

ఎక్కడికక్కడే సమస్యలు

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను గత ప్రభుత్వం ఆర్టిజన్‌లుగా తీసుకుంది. 2017 జూన్‌లో సుమారు 23 వేల మందిని ఆర్టిజన్‌లుగా సంస్థలో విలీనం చేసుకున్నారు. అయితే వీరికి ఉద్యోగులతో సమానంగా ఎలాంటి హక్కులు కల్పించలేదు. కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేసిన సమయంలోనే పనికి దగ్గ వేతనాన్ని పొందేవారు. స్కిల్‌ను బట్టి వారి వేతనాలు ఉండేవి. కానీ ఆర్టిజన్‌లుగా తీసుకున్న తర్వాత వీరి వేతనాలు అమాంతం తగ్గిపోయాయి. అటు కాంట్రాక్ట్ కార్మికులు కాకపోగా ఇటు ఉద్యోగులుగా కూడా గుర్తించక మధ్యలో నలిగిపోతున్నారు. సంస్థలో కీలకంగా పనిచేస్తున్న వీరిని పర్మనెంట్ చేయడంతో పాటు ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

నత్తనడకన ఎఫ్‌జీడీ ప్లాంట్ పనులు

సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7వ దశ నిర్మాణం పూర్తయి విద్యుత్ ఉత్పత్తిలో దూసుకుపోతోంది. అయితే నూతన థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తప్పనిసరైన కాలుష్య నియంత్రణ ప్లాంట్ (ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్ – ఎఫ్‌జీడీ) నిర్మాణపనులు నత్తనడక సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లా పర్యటనకు వస్తున్న సీఎండీ ఈ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

స్పష్టత కరువు

పాల్వంచ కేటీపీఎస్, మణుగూరు బీటీపీఎస్‌లలో టౌన్ షిప్‌ల ఏర్పాటుకు జెన్‌కో యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది. ఈక్రమంలో బీటీపీఎస్‌లో రూ.600 కోట్లతో క్వార్టర్లు, ఇతర సౌకర్యాలతో కూడిన సముదాయలను నిర్మించింది. కానీ, కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం నిర్మాణం 2018లో పూర్తయినప్పటికీ నూతన క్వార్టర్ల ప్రతిపాదన ఇంకా ఆదిలోనే ఉంది. సుమారు 800 క్వార్టర్ల నిర్మాణాలపై స్పష్టత కరువైంది. ఇప్పటికే కాలం చెల్లిన క్వార్టర్లలో ఉద్యోగులు ఉండలేక ఈఎంఐల ద్వారా గృహ నిర్మాణ రుణాలు తీసుకుని సొంత ఇళ్లు నిర్మించుకున్నారు. మరికొందరు శిథిలావస్థలో ఉన్న క్వార్టర్లలో అనేక ఇబ్బందులు పడుతూ కాలం గడుపుతున్నారు.

ఆర్టిజన్లు కోరుతున్న అంశాలు

- కేటీపీఎస్ వైద్యశాలలో వైద్యం, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. ప్రతి నెల వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1000 ఇస్తున్నప్పటికీ వాటి బదులు ఆర్టిజన్ ఉద్యోగి కుటుంబానికి అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించాలి.
- సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలి. ఉద్యోగులకు ఇస్తున్నమాదిరిగా 30 రోజుల సెలవులు, డీఏవీ పాఠశాలలో ఆర్టిజన్‌ల పిల్లలకు రాయితీతో కూడిన ఫీజులు ఇవ్వాలి.
- ఇప్పటికే క్వార్టర్‌లు శిథిలావస్థకు చేరాయి. వీటిల్లో కనీసం ఆర్టిజన్‌లకు అవకాశం ఇస్తే వాటికి మరమ్మతులు చేసుకుని ఉండే అవకాశం ఉంది.
- ఉద్యోగులకు అందిస్తున్న మాదరిగా యూనిఫాం, రెయిన్ కోట్లు, సబ్బులు, ఇతర వస్తువులు అందించాలి.

ఆ మురిపెం రెండు రోజులే..

మొర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి మూసివేత..



మూసివేసిన రెండో బ్రిడ్జి

కొత్తగూడెంరూరల్: జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో భాగంగా తొమ్మిదేళ్ల కిందట మొదలు పెట్టిన లక్ష్మీదేవిపల్లి మొర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి పనులను ఇటీవల ముగించారు. అనంతరం బ్రిడ్జిని ప్రారంభించిన రెండు రోజులకే మూసివేశారు. రెండు రోజులపాటు రెండో బ్రిడ్జిపై రాకపోకలు సాగించిన వాహనదారులు ఉసూరుమన్నారు. 2015లో జాతీయ రహదారి పనుల్లో భాగంగా రుద్రంపూర్ నుంచి భద్రచాలం వరకు 44 కిలోమీటర్ల తారు రోడ్డుతోపాటు మధ్యలో కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 240 కోట్లు మంజురుచేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని మొర్రేడు వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.9 కోట్లు కేటాయించగా గత సోమవారం పనులు పూర్తయ్యాయి. ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ పూర్తి చేయగా మంగళవారం నుంచి వాహనాల రాకపోకలు అనుమతించారు. గురువారం ఈ బ్రిడ్జిని మూసివేశారు. వాహనదారులకు అనుకూలంగా బ్రిడ్జికి సంబంధించిన మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం ఊటతో అధికారులు

బూర్గంపాడు: మండల కేంద్రం సమీపంలోని దోమలవాగు, గోదావరి పరిసర ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం ఆధ్వర్యంలో ఎక్సైజ్, డీటీఎఫ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సుమారు 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు, వీరబాబు, వెంకట్, బాబు, డీటీఎఫ్ అధికారి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కరకగూడెం: పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారంలో గురువారం చోటుచేసుకుంది. ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన బూర రజిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగింది. గమనించిన స్థానికులు ఆమెను మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించారు. రజిని నాలుగేళ్లుగా ఉపాధి హామీ పథకం మేట్‌గా పనిచేస్తోంది. ఆత్మహత్యాయత్నానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రజిని

కొత్తగూడెంలో జోరువాన

పంజాబ్‌గడ్డ బస్తీలో చెట్టుపై పిడుగు..


కొత్తగూడెంటౌన్: పట్టణంలో గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన జోరు వాన కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రామవరం, రుద్రంపూర్, పాలకేంద్రం, విద్యానగర్‌కాలనీ, త్రీఇంక్‌లైన్, గౌతమ్‌పూర్, పాత కొత్తగూడెంలతో పాటు పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. రహదారుల పైకి వర్షం నీరు చేరింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రామవరం పంజాబ్‌గడ్డబస్తీకి చెందిన ఆటో డ్రైవర్ ఏసు ఇంటి సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.



కొబ్బరిచెట్టుపై పిడుగుపడటంతో చెలరేగిన మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

డైవర్షన్ తెగిపోయింది..

ములకలపల్లి: ముత్యాలంపాడు శివారులోని వాగుపై శాశ్వత వంతెన నిర్మిస్తున్న క్రమంలో ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు తెగిపోయింది. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నామమాత్రంగా ఏర్పాటు చేసిన డైవర్షన్‌కు గండి పడడంతో ముత్యాలంపాడు, రాచన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ పనులకు వినియోగించే వాహనాలు సైతం ప్రవాహ వరదలోనే ఉండిపోయాయి. డైవర్షన్ తెగిన నేపథ్యంలో రాత్రి వేళ పలుగ్రామాలు జలదిగ్బంధనంతోనే గడపాల్సి వచ్చింది. ఒకే ఒక్క తూరతో మోరీ ఏర్పాటు చేయడంతో, దిగువకు నీళ్లు వెళ్లే అవకాశం లేకపోవడంతో డైవర్షన్ రోడ్డు తెగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చేతులు దులుపుకున్నట్లుగా వ్యవహరించడం కోతకు గురైందని ఆరోపిస్తున్నారు.



తెగిపోయిన డైవర్షన్ రోడ్డు.. వరద ప్రవాహంలో చిక్కుకున్న జేసీబీ..

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

- భద్రాచలంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలో ఘటన
- భవనం పైనుంచి పడిందని కుటుంబీకులకు సమాచారం
- హత్యాయత్నం జరిగిందని తల్లి, బంధువుల ఆరోపణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని కూనవరం రోడ్డులో కొనసాగుతున్న ఓ నర్సింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని కారుణ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కళాశాలలోని హాస్టల్ భవనం మొదటి అంతస్తు నుంచి ఉదయం ఆమె కింద పడినట్లు గుర్తించిన సహచర విద్యార్థులు నిర్వాహకులకు తెలపగా 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలతో అక్కడ చికిత్స పొందుతూనే సాయంత్రం మృతి చెందింది. అయితే, ఘటనపై అనుమానాలు ఉన్నాయని, కారుణ్యపై హత్యాయత్నం జరిగిందని ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మేనమామ వద్ద ఉంటూ..

కారుణ్యది ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సిద్దినగర్ కాగా, కుటుంబ కారణాలతో ఆమె ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో మేనమామ ప్రవీణ్ వద్ద ఉంటోంది. నర్సింగ్ చేయాలనే కోరికతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చేరగా ఇప్పుడు మొదటి సంవత్సరం చదువుతోంది. ఇదే కాలేజీకి సంబంధించి మరోచోట ఉన్న హాస్టల్‌లో ఉంటుండగా.. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి గది నుంచి బయటకు వచ్చింది. ఆపై కొద్దిసేపటికే మరో విద్యార్థిని అటుగా వెళ్లడంతో కారుణ్య రక్తపు మడుగులో ఉండగా సహచర విద్యార్థులతో కలిసి కళాశాల నిర్వాహకులకు తెలిపారు. ఆపై 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, సీసీ ఫుటేజీని పరిశీలించగా కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన కారుణ్య, హాస్టల్ మొదటి అంతస్తుపైకి వెళ్తున్నట్లుగా కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఆ తర్వాత ఫుటేజీలో కారుణ్య కనిపించలేదని, అనంతరం మొదటి అంతస్తు నుంచి పడినట్లుగా నమోదైందని చెప్పారు. కాగా, కారుణ్యకు ఫిట్స్ ఉండటంతో మొదటి అంతస్తు పైనుంచి పడి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు.



ఆస్పత్రి ఐసీయూలో కారుణ్య

అత్యవసర చికిత్స చేసినా..

తీవ్రంగా గాయపడిన కారుణ్యను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు తల, నుదుటి భాగంలో తీవ్ర గాయాలైనట్లు గుర్తించారు. ఆపై ఐసీయూలో చేర్చి చికిత్స చేస్తూనే, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రయత్నాల్లో ఉండగానే కారుణ్య కుటుంబీకులు మాత్రం ఇక్కడే చికిత్స చేయాలని పట్టుబట్టారు. దీంతో చికిత్స కొనసాగుతుండగానే ఆమె సాయంత్రం మృతి చెందింది.

నిజానిజాలు బయటకు రావాలి

కారుణ్య ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ నిర్వాహకులు ఫోన్‌లో చెప్పడంతో ఆమె తాత కోట యాహు, తల్లి సునీత, చెల్లి ప్రశాంతి, మేనమామ ప్రవీణ్ వచ్చారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిందని చెప్పారని వారు తెలిపారు. అయితే, కారుణ్యను పరిశీలించినప్పుడు ప్రమాదవశాత్తు కింద పడినట్లుగా గాయాలు లేవని అనుమానిస్తే పొంతన లేని సమాధానం ఇచ్చారని ఆరోపించారు. ఆమెను ఎవరో కొట్టినట్లుగా అనుమానం ఉన్నందున పూర్తిస్థాయిలో విచారించాలని, హాస్టల్ నిర్వాహకులపై తమకు అనుమానం ఉందని వారు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సమగ్ర దర్యాప్తు జరిపి స్తామని తెలిపారు.

పురుగులమందు తాగి ఆర్టిజన్ ఆత్మహత్య

పాల్వంచ: పురుగులమందు తాగి ఆర్టిజన్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు ఇండ్ల రవి (38) పట్టణంలోని రాంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆయన భార్య రమ్యకృష్ణ, ఇద్దరు కూతుర్లు, కుమాడితో కలిసి కోదాడలోని పుట్టింట్లో ఉంటోంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో రవి ఇంట్లో గురువారం ఉదయం పురుగులమందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. భార్య రమ్యకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి...

పాల్వంచరూరల్: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పాండురంగాపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాండురంగాపురానికి చెందిన ఎల్లావుల వెంకటేశ్వర్లు (37) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి కడుపునొప్పి విపరీతంగా రావడంతో ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఏరియాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య కుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్య



భద్రం మృతదేహం

ములకలపల్లి: ములకలపల్లి మాజీ సర్పంచ్ బీబినేని వీరభద్రం (38) పురుగులమందు తాగగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మద్యానికి బానిసైన భద్రం బుధవారం రాత్రి పురుగులమందు సేవించగా స్థానికులు మంగపేట పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య బీబినేని నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజమౌళి తెలిపారు. కాగా, టీడీపీ, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తేళ్ల చెన్నయ్య, మోరంపూడి అప్పారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బత్తుల అంజి, శనగపాటి సీతారాములు, పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, గాడి తిరుపతిరెడ్డి, బిక్కుమళ్ల సుధాకర్, చిలకపాటి చందర్‌రావు తదితరులు భద్రం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, నాయకులు నరాటి ప్రసాద్ కొత్తగూడెం ఏరియాస్పత్రిలో భద్రం మృతదేహానికి నివాళులర్పించారు.

పురుగులమందు తాగి వ్యక్తి...

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం గ్రామంలోని రైల్వే ట్రాక్ పక్కన పొలాల్లో గోరంట్ల నారాయణరాజు (50) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డకు చెందిన గోరంట్ల నారాయణరాజు వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నారు. నిత్యం మద్యం సేవించి వస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నారాయణరాజు హేమచంద్రాపురం రైల్వే ట్రాక్ పక్కన పురుగులమందు తాగి విగతజీవిగా కనిపించాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి బంధువు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో ఒకరు..

మణుగూరుటౌన్: వడదెబ్బతో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన గడదాసు శంకర్ (38) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రోజులాగే ఆటో నడిపి రాత్రి ఇంటికి రాగా, వాంతులు, విరేచనాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు.

చెట్టు విరిగిపడి వ్యక్తి...

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం అటవీ రేంజ్ పరిధిలో గురువారం తునికాకు సేకరిస్తుండగా చెట్టు విరిగిపడి వాంకుడోత్ హచ్చ (62) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని పోలారం గ్రామ పంచాయతీ భద్రుతండాకు చెందిన వాంకుడోత్ హచ్చ, అతడి భార్య తులసి వారం రోజుల కిందట గుండాల మండలం రేగళ్లగూడెం గ్రామానికి వెళ్లారు. తునికాకు సేకరణకు గురువారం కొమరారం అటవీ రేంజ్ పరిధిలోకి వెళ్లగా ఆ సమయంలో చెట్టు విరిగిపడటంతో హచ్చ మృతి చెందాడని అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. హచ్చ మృతికి గల కారణాలపై విచారణ చేపట్టామని కొమరారం ఎఫ్ఆర్ఓ ఉదయ్ తెలిపారు.

13 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో అధికారులు

భద్రాచలం: కారులో తరలిస్తున్న గంజాయిను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన భద్రాచలంలో గురువారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ అధికారుల కథనం మేరకు.. ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న 13 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, కారు, అందులోని నిందితులను సీఐ రహీమున్నీసా బేగంకు అప్పగించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఉద్యోగులు కరీం, సుధీర్, వెంకట్, హరీశ్, హన్మంతరావు పాల్గొన్నారు.

సుజ్ఞానపురంలో కార్డన్‌సెర్చ్

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురంలో దుమ్ముగూడెం పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు గురువారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా కేసుల్లో ఎక్కువగా సుజ్ఞానాపురం గ్రామస్తులు పట్టుబడుతుండటంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామపెద్దల చేత హామీపత్రం తీసుకున్నారు. సీఐ బి.అశోక్, ఎస్‌ఐలు పి.కేశవరావు, పి.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.